క్లుప్తంగా

మున్సిపల్ కమిషనర్‌కు సత్కారం



గుడివాడటౌన్: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని మున్సిపాల్ షాప్స్ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు గురువారం మున్సిపాల్ కమిషనర్ బి.శ్రీనివాసరావు, అసిస్టెంట్ కమిషనర్ పి.శ్రీనివాసరావులను ఘనంగా సత్కరించారు. ఈఏడాది పరిపాలన విషయాలలో అధికారులకు ఏవిధమైన ఆటంకాలు కలుగకూడదని, మంచి పరిపాలన సాగించాలని కోరుకుంటున్నామని వివరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్, సభ్యులు సయ్యద్ గఫార్, కృష్ణ, కొత్తా సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

చర్చి నిర్మాణానికి రూ.లక్ష విరాళం



గుడ్లవల్లేరు: డోకిపర్రు కొత్త దళితవాడలోని ఆర్సీఎం చర్చి నిర్మాణానికి హిందూస్థాన్ పెట్రోలియం చెన్నై ప్రాంత మాజీ మేనేజర్ డాక్టర్ తీట్ల వీరయ్య రూ.1,07,900ను తనవంతు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో ఆర్సీఎం సంఘ పెద్దలు ముత్యాల సర్వేశ్వరరావు, మెండు ఏసుబాబు, వంగలపాటి దేవరాజు, మద్దాల నాగన్న తదితరులు పాల్గొన్నారు.

కవి సమ్మేళనం



గుడివాడటౌన్: నిరాశ, నిస్పృహలను వీడి ఆత్మ శ్వాసంతో ఆశావాద దృక్పథంతో ప్రజలు కొత్త సంవత్సరంలో అడుగుపెట్టాలని పలువురు కవులు అభిప్రాయపడ్డారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో గురువారం పట్టణ కవులు కవి సమ్మేళనం నిర్వహించారు. సాహితీమిత్ర, సాహితీ స్రవంతి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పలువురు కవులను, సాహితీ ప్రియులను, సాహితీవేత్తలను సత్కరించారు. కార్యక్రమంలో సాహితీమిత్ర కన్వీనర్ వసుధ బసవేశ్వరరావు, సాహితీ స్రవంతి ప్రధానకార్యదర్శి లంకా సురేంద్ర, సాహితీ వేత్తలు ఎంవీ ఆంజనేయులు, ఆర్‌సీపీ రెడ్డి, మాల్యాద్రి, వై.కోటేశ్వరరావు, పీవీఎస్ రాజకుమారి, జి.మరియా పీటర్, రజిని తదితరులు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ



ముదినేపల్లి రూరల్: ఏపీటీఎఫ్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ తన కార్యాలయంలో గురువారం ఆవిష్కరించారు. సంఘ నాయకుడు జాన్సన్ బాబు ఆధ్వర్యంలో పలువురు ఎంపీపీని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలను తెలిపి క్యాలెండర్‌ను ఆవిష్కరింపజేశారు.

ఊరికి ఉపకారి



గుడ్లవల్లేరు: సింగలూరు గ్రామాన్ని దత్తత తీసుకుని సకల వసతుల్ని కల్పించడమే కాకుండా ఆ గ్రామంలో వసతులను ఎప్పటికప్పుడు మెరుగు పరచేందుకు కృషి చేస్తున్నారు ప్రముఖ సంఘ సేవకుడు డాక్టర్ బండారు శ్యామ్‌కుమార్. తాను దత్తత తీసుకున్న సింగలూరులో గతంలో గ్రామస్తుల సంయుక్త సహకారంతో ఆర్వోప్లాంట్ ఏర్పాటు చేశారు. ఆ ప్లాంట్‌కు చెందిన పైపులైన్లకు కాలం చెల్లడంతో గురువారం కొత్త పైపులైన్ ఏర్పాటుకు అవసరమైన సామగ్రిని తెప్పించి పనులు చేపట్టారు. బండారు సేవలను గ్రామస్తులు కొనియాడారు.

సాయినాథుడికి ప్రత్యేక పూజలు

పామర్రు: స్థానిక సాయినగర్‌లోని శ్రీషిర్డి సాయిబాబా ఆలయంలో భక్తులు గురువారం స్వామివారికి విశేష పూజలు చేశారు. తొలుత ఆలయంలో బాబావారికి కాగడా హారతితో కార్యక్రమాలను ప్రారంభించారు.
పంచామృతాలతో స్వామివారికి అభిషేకాలు చేశారు. అనంతరం వచ్చిన భక్తులు అందరికి బాబావారి అన్న ప్రసాదాన్ని అందజేశారు. ఆలయంలో పూజా కార్యక్రమాలను ఆలయ అర్చకులు పావులూరి శర్మ ఆధ్వర్యంలో నిర్వహించినట్లు ఆలయ వంశపారంపర్య ధర్మకర్త తమ్మా వినోద్ తెలిపారు. కార్యక్రమంలో షిర్డిసాయి భక్తమండలి సభ్యులు బొమ్మారెడ్డి రామకృష్ణారెడ్డి, మధుసూదనరావు, మల్లికార్జునరావు, సాయి, రాధాకృష్ణ, సురేష్, అప్పయ్య పాల్గొన్నారు.



రేమల్లిగూడెం వద్ద ధ్వంసమైన రోడ్డు



చిత్రం సమీపంలో గతుకులమయంగా ఉన్న రోడ్డు



పెంజెంద్ర వద్ద కోతకు గురైన రోడ్డు

ప్రయాణం ప్రత్యక్ష నరకమే

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు మండలంలోని పెంజెంద్ర-గుడ్లవల్లేరు రహదారి పూర్తిగా మరమ్మతులకు గురైంది. చిత్రం, రేమల్లిగూడెం ప్రాంతాల్లో కూడా మోకాలు లోతు గోతులతో ఈ రోడ్డు ఉండటంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. రోడ్డంతా అడుగడుగునా గతుకులమయంగా మారింది. కత్తుల్లా మొనలు తేలి కంకరరాళ్లు తేలియాడుతున్నా పాలకులకు పట్టడం లేదు.రోడ్డు కోతకు గురైనా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఈ రోడ్డులో రాత్రిళ్లు ప్రయాణం చేసే వాహనచోదకులు, ప్రయాణికులు తీవ్ర అవస్థలుపడుతున్నారు. గోతుల్లో వాహనాలు పడిపోతుండటంతో వాహనచోదకులు తీవ్రంగా గాయపడుతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి అధ్వానంగా ఉన్న ఆయా రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని వాహనచోదకులు, ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

గోతుల్లో పడి గాయాలపాలు...



వాహనచోదకులు రాకపోకల్లో గోతుల్లోపడి గాయాల పాలవుతున్నారు. రోడ్లు బాగోక ప్రజలు అడుగడుగునా ఇబ్బందులకు గురవుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అన్ని రహదారులను నిర్మిస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకునేందుకు వెంటనే రోడ్లను నిర్మించాలి.

–పోలుకొండ వైదేహి, వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ సభ్యురాలు(పెంజెంద్ర)

రోడ్ల నిర్మాణాలు ఎక్కడ?..



కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రోడ్లన్నింటినీ నిర్మిస్తామన్నారు. ఆ నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలి. కేవలం ఉపాధి హామీ పథకం కింద కేంద్రం ఇచ్చిన నిధులతో సీసీ రోడ్ల పనులకు మాత్రమే ప్రాధాన్యమిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం రోడ్ల పనులకు ఎలాంటి నిధులను ఇవ్వలేదు.

–బలుసు జితేంద్ర,
వైఎస్సార్ సీపీ పోలింగ్ బూత్‌ల గుడ్లవల్లేరు మండల కన్వీనర్

మాజీప్రధాని మన్మోహన్‌సింగ్‌కు నివాళి

కూచిపూడి(మొవ్వ): పామర్రు కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ మొవ్వ మోహనరావు ఆధ్వర్యంలో మొవ్వ మండలం కూచిపూడిలో గురువారం మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్‌సింగ్ సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. మోహన్‌రావు మాట్లాడుతూఆర్థిక సంస్కరణలు అమలు చేసి భారతదేశాన్ని ప్రపంచంలో అత్యున్నత స్థానంలో తీసుకెళ్లిన గొప్ప ప్రధానిగా మన్మోహన్ సింగ్ నిలిచిపోయారని కొనియాడారు. నివాళులర్పించిన వారిలో మొవ్వ మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పిట్టు శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు మదలి నాగభూషణం, కాగిత సోమేశ్వరరావు, నల్లూరి పాపారావు, జిల్లా ప్రధానకార్యదర్శి శనగల బ్రాహ్మయ్య నియోజకవర్గం పార్టీ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.



కూచిపూడిలో మన్మోహన్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్‌పార్టీ నాయకులు

ఉత్సాహంగా సంక్రాంతి ముగ్గుల పోటీలు



ముగ్గుల పోటీలను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ పూర్ణచంద్రారెడ్డి, న్యాయ నిర్ణేతలు



రంగులతో అందమైన రంగవల్లులను తీర్చిదిద్దిన విద్యార్థినులు

పామర్రు: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని స్థానిక యలమర్రురోడ్డులో ఉన్న ఏఎన్ఎం హైస్కూల్‌లో గురువారం ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో సుమారు 70 మందికి పైగా విద్యార్థినులు పాల్గొని రకరకాల రంగవల్లులను తీర్చిదిద్దారు. ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా వార్డుమెంబరు బావురపల్లి పద్మజ, కె.విజయ్‌కుమారి, వై.రజనికుమారి వ్యవహరించారు. ముగ్గుల పోటీల జూనియర్స్ విభాగంలో మధుశ్రీ, ఎం.శ్రీవల్లీ, సీహెచ్ సమతశ్రీ, సీనియర్స్ విభాగంలో ఆర్.అక్షిత, పీ ప్రసన్న, ఎండీ భర్షా,తుస్నీసా వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను గెలుచుకున్నారు. విజేతలను న్యాయనిర్ణేతలతోపాటు ప్రిన్సిపాల్ ఎ.పూర్ణ చంద్రారెడ్డి, హెచ్ఎం డి.శామ్యూల్, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

కాంట్రాక్టర్ నిర్లక్ష్యానికి రెండు గేదెలు బలి



మృతిచెందిన గేదెను చూపుతున్న బాధిత రైతు ప్రసాద్



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఏఈలు గోవింద్, లక్ష్మీతులసి

- విద్యుదాఘాతంతో రెండు గేదెలు మృత్యువాత
- పాడి రైతులకు రూ.2.20లక్షల నష్టం

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు మండలంలోని కౌతవరం ఒకటోవార్డులో ఓ కాంట్రాక్టర్ నిర్లక్ష్యానికి రెండు పాడి గేదెలు విద్యుదాఘాతంతో మృత్యువాతపడ్డాయి. బాధిత పాడి రైతులు పామర్తి నరసింహారావు, ప్రసాద్ కథనం మేరకు ఓ కాంట్రాక్టర్ పుల్లేటి కాల్వలో పొక్లెయిన్‌తో గుర్రపు డెక్క తొలగింపు పనులను చేపట్టాడు. ఆ కాల్వ గట్టున ఉన్న విద్యుత్ స్తంభాన్ని పెకలించి పక్కకు పడేశాడు. ఆ స్తంభాన్ని తొలగించేటపుడు కనీసం విద్యుత్ అధికారులకు సమాచారం ఇవ్వలేదు. స్తంభం తొలగింపు విషయంపై విద్యుత్‌శాఖ అధికారులకు కూడా ఎటువంటి సమాచారం ఇవ్వలేదు. ఇటీవల ఆప్రాంతంలో పుల్లలు ఏరుకోవడానికి వెళ్లిన మహిళ స్వల్పంగా విద్యుదాఘాతానికి గురికావడంతో గ్రామస్తులు అటువైపు వెళ్లడం మానేశారు.ఈ క్రమంలో గురువారం రెండు గేదెలు మేత కోసం అటుగా వెళ్లి విద్యుదాఘాతానికి గురై మృతిచెందాయి.
గేదెల మృతితో తమకు రూ.2.20లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని బాధిత రైతులు నరసింహారావు, ప్రసాద్ వాపోతున్నారు. తమకు ప్రభుత్వం న్యాయం చేయాలని కోరుతున్నారు. విద్యుత్ ఏఈ గోవింద్, లైన్‌మెన్ సత్యనారాయణ, ఇరిగేషన్ ఏఈ లక్ష్మీతులసి, ఎల్ఎస్ దావీదు సంఘటనా స్థలాన్ని సందర్శించారు. బాధిత రైతుల నుంచి వివరాలను సేకరించారు. కాంట్రాక్టర్ కారణంగా గేదెలు మృతిచెందడంపై గ్రామస్తులు మండిపడుతున్నారు. బాధిత పాడిరైతులకు ఆర్థికసాయం అందించి వారిని ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కొండరాయి చెరువు గట్లు ప్రక్షాళన



మండవల్లి: మండవల్లిలోని రెండో తాగునీటి చెరువు కొండరాయి చెరువు గట్లను ఇటీవల సర్పంచ్ మెండా ఝాన్సీ, కార్యదర్శి సాయిప్రదీప్ ఆధ్వర్యంలో ప్రక్షాళన చేపట్టారు. చెరువు గట్టు శుభ్రం చేసే ప్రక్రియను గురువారం గ్రామసర్పంచ్, కార్యదర్శి పరిశీలించారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు మెండా సురేష్ పాల్గొన్నారు.

మండవల్లిలో నగర సంకీర్తన

మండవల్లి: ధనుర్మాసం సందర్భంగా స్థానిక దత్త పరంపర సహిత షిర్డీ సాయిబాబా మందిరం ఆధ్వర్యంలో గురువారం భక్తులు నగర సంకీర్తన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు వెళ్లి భిక్ష స్వీకరించారు. గుడివాడ చిట్టిబాబు, యిన్నా వెంకటేశ్వరరావు, బండారు వెంకయ్య, పయ్యావుల సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



కిసాన్ సమ్మాన్ నిధి పెంపుపై హర్షం

కైకలూరు: కిసాన్ సమ్మాన్ నిధి యోజన రూ.6000 నుంచి రూ.10,000 పెంపుపై బీజేపీ కిసాన్ మోర్చా ఏలూరు జిల్లా అధ్యక్షుడు కీర్తి వెంకట రామప్రసాద్ గురువారం హర్షం వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్రమోదీ వ్యవసాయం అంటే దండగ కాదు పండగ చేయాలనే ఉద్దేశ్యంతో వ్యవసాయ రంగంలో సంస్కరణలు చేస్తున్నారని పేర్కొన్నారు.

విద్యాభివృద్ధికి కృషి చేయాలి

ముదినేపల్లి రూరల్: పాఠశాల యాజమాన్య కమిటీల సభ్యులు విద్యాభివృద్ధికి కృషి చేయాలని ఎంఈఓ కె.నరేష్‌కుమార్ కోరారు. స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో పాఠశాలల యాజమాన్య కమిటీల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, ఉపాధ్యాయులకు కమిటీల పనితీరుపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. రీసోర్స్ పర్సన్లు చంద్రశేఖర్, మస్తాన్, యశోద కృష్ణ, కమిటీల విధివిధానాల గురించి వివరించారు.

వైభవంగా లక్ష తులసీ పూజ

ముదినేపల్లి రూరల్: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా స్థానిక పెదరామాలయంలో లక్ష తులసీ పూజను గురువారం వైభవంగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి ఆలయ అర్చకులు బృందావనం రామశ్రీనివాసు, శ్రీనివాసుల లక్ష్మీనృశింహాచార్యుల ఆధ్వర్యంలో లక్షతులసీ పూజ చేశారు. మహిళలు పూజలో పాల్గొనగా కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ



మాట్లాడుతున్న జెడ్పీటీసీ రమణకుమారి

పమిడిముక్కల: పదిలో నూరుశాతం ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషిచేయాలని జెడ్పీటీసీ సభ్యురాలు యేనుగ వెంకటరమణకుమారి సూచించారు. తాడంకి హైస్కూల్‌లోని 10వ తరగతి విద్యార్థులు 100మందికి రూ.7వేల విలువైన స్టడీ మెటీరియల్‌ను గురువారం పంపిణీ చేశారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. విద్య ద్వారానే అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

ముదినేపల్లి రూరల్: ముదినేపల్లిలో పేకాట ఆడుతున్న ఆరుగురిని బుధవారం రాత్రి అరెస్టు చేసినట్లు ఎస్సై వీరభద్రరావు తెలిపారు. స్థానికంగా కొంతమంది పేకాట ఆడుతున్నట్లు సమాచారం మేరకు దాడి చేసి ఆరుగురిని అరెస్టు చేసి చెప్పారు. వారి నుంచి రూ.24100 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు వివరించారు.

'గూడపాటి' సేవలు అభినందనీయం



నందివాడ: మండలం తుమ్మలపల్లి గ్రామాభివద్ధికి లక్షలాది రూపాయల సొంత నిధులతో ఎనలేని కృషిచేసిన గూడపాటి వెంకటేశ్వరరావు అందరికీ ఆదర్శప్రాయులని వక్తలు కొనియాడారు. గూడపాటి వెంకటేశ్వరరావును గ్రామస్తులు గురువారం ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా గ్రామపెద్దలు మాట్లాడుతూ సాధారణ రైతుగా జీవితాన్ని ప్రారంభించి ఉన్నత శిఖరాలు అధిరోహించిన గూడపాటి వెంకటేశ్వరరావు గ్రామాభివృద్ధికి విశేషం కృషిచేశారంటూ కొనియాడారు. 92 ఏళ్ల వయసు వచ్చిన యువకుడు మాదిరి పదిమందికి సహాయం చేయడంలో వెంకటేశ్వరరావు చేస్తున్న కార్యక్రమాలు ఆదర్శప్రాయమని ఆయన కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. అనంతరం 92వ పుట్టినరోజు సందర్భంగా అభిమానులు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గూడపాటి కుటుంబ సభ్యులు గూడపాటి కావ్యశ్రీ ,కానూరి రాజేంద్ర , కానూరి గీత, డాక్టర్ కానూరి సిద్ధినితిన్, కానూరి నాగఅమన్, గూడపాటి కోటేశ్వరరావు, రాజేశ్వరి, గూడపాటి వెంకటకష్ణ, విజయలక్ష్మి, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

రైతులకు రుణపరిమితి పెంచాలని వినతి

గుడ్లవల్లేరు: వ్యవసాయానికి రుణ పరిమితిని పెంచాలని రైతుక్లబ్ కన్వీనర్ పెన్నేరు ప్రభాకరరావు కోరారు. జిల్లా కలెక్టర్ డీకే బాలాజీని గురువారం ఆయన మచిలీపట్నంలో కలిసి ఈమేరకు ఓ వినతిపత్రం అందజేశారు. సాగుఖర్చులు విపరీతంగా పెరుగగా, రైతులకు సాగునిమిత్తం బ్యాంకర్లు ఇచ్చే రుణాలు నామమాత్రంగానే ఉన్నాయని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. రైతులకు రుణపరిమితిని పెంచేలా బ్యాంకర్లను ఆదేశించాలని కలెక్టర్‌ను కోరినట్లు చెప్పారు. సమస్య పరిష్కారానికి కృషిచేస్తానని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు ఆయన వివరించారు.



కలెక్టర్ బాలాజీతో మాట్లాడుతున్న రైతుక్లబ్ కన్వీనర్ ప్రభాకరరావు

మినుములో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి : ఏడీఏ

గుడివాడరూరల్: మినుము పైరులో తెగుళ్ల వ్యాప్తి చెందకుండా రైతులు ముందస్తు చర్యలను చేపట్టాలని ఏడీఏ నిమ్మగడ్డ రమాదేవి సూచించారు. మండలంలోని లింగవరం, మల్లాయపాలెం గ్రామాల్లో గురువారం మండల వ్యవసాయశాఖ అధికారి బోలెం అనంతలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఏడీఏ పాల్గొని మినుముపంటను పరిశీలించారు.
రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈసందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ ప్రస్తుతం మినుము పైరుకు బూడిద తెగులు ఆశించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. పైరు పూతదశ చేరుకునే సమయంలో ఆకుల మీద తెల్లని బూడిద, పొడి రూపంలో ఉన్న చిన్నమచ్చలు ఏర్పడి క్రమేపి వలయాకారంగా పెరిగి క్రింది భాగం కూడా పాడవుతుందన్నారు. దీంతో దిగుబడి తగ్గే అవకాశం ఉందన్నారు. దీని నివారణకు 40నుండి 50 రోజుల మధ్యలో 3గ్రాముల మోనోసీజిబ్, ఒక మిల్లీ లీటరు డినోకాప్‌ను లీటర్ నీటికి చొప్పున కలిపి పిచికారి చేసుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఏఈవో అనిత, ఆయా గ్రామాల రైతులు, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.



లింగవరంలో పంటను పరిశీలిస్తున్న ఏడీఏ రమాదేవి, ఏవో, రైతులు

సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు



గ్రామసభలో మాట్లాడుతున్న మండవల్లి ఇన్‌చార్జి తహసీల్దార్ కె.గోపాల్



గ్రామసభలో పాల్గొన్న నోడల్ అధికారి ఫణిధూర్జటి, తహసీల్దార్ నవీన్‌కుమార్

గుడివాడరూరల్: రెవెన్యూ సేవలను ప్రజలకు సులువుగా అందించేందుకు ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని తహసీల్దార్ వాసిరెడ్డి రామకోటేశ్వరరావు తెలిపారు. మండలంలోని శేరీగొల్వేపల్లిలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ప్రజలు, రైతుల వద్ద నుంచి ఆయన అర్జీలను స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను రెవెన్యూ సదస్సుల్లో పరిష్కరిస్తామన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ కోరారు. ఆర్ఐ నాగబాబు, రెవెన్యూ సిబ్బంది, గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.

మండవల్లి మండలంలో..

మండవల్లి: రెవెన్యూ సదస్సులను వినియోగించుకోవాలని ఇన్‌చార్జి తహసీల్దార్ కె.గోపాల్ సూచించారు. మండలంలోని చింతలపూడి, లేళ్లపూడి గ్రామాల్లో గురువారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ చింతలపూడిలో ఒక అర్జీ, లేళ్లపూడిలో రెండు అర్జీలు అందినట్లు తెలిపారు. ఆర్ఐ శ్రావణి, వీఆర్ఓ శ్యామలరావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పమిడిముక్కల మండలంలో..

పమిడిముక్కల: రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకొని భూ సమస్యలు పరిష్కరించుకోవాలని మండల నోడల్ అధికారి ఎం.ఫణి ధూర్జటి సూచించారు. మండలంలోని శ్రీరంగపురంలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. వివిధ సమస్యలపై ఐదు దరఖాస్తులు అందాయని, ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకొంటున్నామని తహసీల్దార్ నవీన్‌కుమార్ తెలిపారు. రీసర్వే డీటీ యేసుపాదం, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామసభలతో సమస్యల పరిష్కారం

ముదినేపల్లి రూరల్: రెవెన్యూ గ్రామసభలతో రైతుల భూసమస్యలను పరిష్కరించుకోవడం సాధ్యపడుతుందని తహసీల్దార్ జేఎస్ సుభానీ అన్నారు. మండలంలోని సింగరాయపాలెంలో గురువారం రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. రైతుల నుంచి వినతిపత్రాలను అధికారులు స్వీకరించారు.

మాధవరావుకు పలువురి నివాళి



పెదపారుపూడి: మండల పరిషత్ కార్యాలయ సూపరిండెంటెంట్‌గా పనిచేస్తూ గుండెపోటుకు గురై మృతిచెందిన గుంజా మాధవరావు(58) భౌతికకాయానికి గురువారం అంత్యక్రియలు నిర్వహించారు. మాధవరావు సోమవారం రాత్రి తిరుపతి నుంచి గుడివాడ వస్తుండగా కావలి వద్ద గుండెపోటుకు గురై మృతిచెందారు. ఆయన భౌతికకాయాన్ని గుడివాడలోని ఆయన స్వగృహానికి తీసుకువచ్చి అంత్యక్రియలు చేశారు. మాధవరావు భౌతికకాయాన్ని ఎంపీడీవో టీ. సీతామహాలక్ష్మి, ఈవోపీఆర్డీ వంగా శ్రీనివాస్ సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబసభ్యులను పరామర్శించి వారికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఎంపీడీవో మాట్లాడుతూ విధి నిర్వహణలో మాధవరావు ఎంతో అంకితభావంతో పనిచేశారని గుర్తుచేశారు.

ముదినేపల్లి రూరల్: మండలానికి గతంలో ఇన్‌చార్జి ఎంపీడీవోగా, ఏవోగా విధులు నిర్వహించిన గుంజా మాధవరావు మృతికి ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు ఈడే వెంకటేశ్వరమ్మ, మండల పరిసత్ కార్యాలయ సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు. ఆయన సేవలను కొనియాడారు.

కక్ష సాధింపులకు పాల్పడుతున్న టీడీపీ నాయకులు



కాళీని జైలుకు తరలిస్తున్న పోలీసు

గుడివాడరూరల్: టీడీపీ నాయకులు అధికారాన్ని అడ్డుపెట్టుకుని చిన్నచిన్న కేసులను బయటకు తీస్తూ వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలను వేధింపులకు గురిచేస్తున్నారు. రెండేళ్ల కిందట జరిగిన స్వల్పవివాదం ఘటనను మరోసారి వెలుగులోకి తెచ్చి వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు మెరుగుమాల కాళీని పోలీసులు అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపర్చగా అతనికి 10రోజులు రిమాండ్ విధించారు. దీంతో కాళీని నెల్లూరు జైలుకు తరలించారు. నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీని ఎదుర్కొలేక నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులపై టీడీపీ నాయకులు అక్రమకేసులు బనాయించడం తగదని వైఎస్సార్‌సీపీ నాయకులు పేర్కొంటున్నారు. నందివాడ మండలం ఇలపర్రు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడు చింతాడ నాగూర్ గ్రామంలో వాటర్‌ప్లాంట్ పెట్టుకుని జీవనం సాగిస్తుంటే నిబంధనలు పాటించడం లేదంటూ వాటర్‌ప్లాంటు సీజ్‌చేయిస్తామని టీడీపీ నాయకులు బెదిరింపులకు దిగగా, గ్రామస్తులే వారిని అడ్డుకున్నారు. తమకు మంచినీరు లేదని, ప్లాంట్ మూసివేస్తే ఎలా అంటూ గ్రామస్తులు ప్రశ్నించడంతో సంబంధిత అధికారులు వెనుదిరగడం గమనార్హం. ఈవిషయంపై నాగూర్ మాట్లాడుతూ కేవలం తనపై కక్ష సాధించేందుకే వేధింపులకు పాల్పడుతున్నారని, భయపడేది లేదని స్పష్టం చేశారు.

పెరికెగూడెంలో గ్రామసభ

మండవల్లి: మండలంలోని పెరికెగూడెంలో గురువారం గ్రామసభ నిర్వహించారు. సమావేశానికి సర్పంచ్ పెరుమాళ్ల పద్మ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు తాగునీరు, రహదారులు, తదితర విషయాలపై గ్రామ సభలో చర్చించారు. కార్యదర్శి ఎస్‌వీ రాధిక, వైఎస్సార్‌సీపీ నాయకుడు పెరుమాళ్ల సత్యనారాయణ, వీఆర్వో పాల్గొన్నారు.